క్లుప్తంగా

త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం

● పీఆర్ శాఖ డీఈ లింగారెడ్డి

సాక్షి స్పందన

నడికూడ : 'ప్రాణం పోతే కానీ స్పందించరా' శీర్షికతో మంగళవారం ప్రచురితమైన సాక్షి కథనానికి పంచాయతీ రాజ్ శాఖ డీఈ లింగారెడ్డి స్పందించారు. వెంటనే మండలంలోని చౌటుపర్తి గ్రామ శివారులోని యాపకుంట చెరువు కట్టపై ఉన్న రోడ్డుకు సైడ్‌గార్డ్స్ ఏర్పాటు చేయించడంతోపాటు బావి చుట్టూ మొరం మట్టితో రక్షణ ఏర్పాటు చేయించనున్నట్టు తెలిపారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని లింగారెడ్డి స్పష్టం చేశారు.

వైఎస్ షర్మిల అరెస్ట్ అప్రజాస్వామికం

శాయంపేట : ప్రజాసమస్యలపై శాంతియుతంగా పోరాడుతున్న వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను పోలీసులు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మారపల్లి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఆటవిక పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. సిట్ అధికారులను కలిసేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో వెళ్తున్న షర్మిలను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. పోలీసుల అతిగా ప్రవర్తించడంతోపాటు షర్మిలను అరెస్ట్ చేశారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో అధికార పార్టీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సునీల్, మల్లేష్, శంకర్, మమత, లత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జెర్సీ ఆవు మృతి



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన పులగం రాజు అనే రైతుకు చెందిన జెర్సీ ఆవు విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందింది. బాధిత రైతు కథనం ప్రకారం.. ఇటీవల వీచిన ఈదురు గాలులకు ఉప్పల్ రైల్వే ట్రాక్ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైరు తెగిపడింది. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే మంగళవారం రాజు కుమారుడు మనీష్ ఆవును మేపడానికి తీసుకెళ్తుండగా తెగి పడిన విద్యుత్ వైరు తగిలి ఆవు అక్కడికక్కడే మృతి చెందగా మనీష్ తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కాగా మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఆవు మృతి చెందిందని గ్రామస్తులు, రైతులు అంటున్నారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధిత రైతుకు పరిహారం చెల్లించడంతోపాటు సకాలంలో విద్యుత్ తీగలను తొలగించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలికకు గాయాలు

శాయంపేట : వేసవి సెలవుల్లో సరదాగా సైకిల్ తొక్కుతున్న బాలికలను ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పెద్దకోడెపాక గ్రామ శివారులోని కల్లు మండవ మూలమలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దకోడెపాకకు చెందిన శ్రీనివాస్ కూతురు సాయిప్రియ (9వ తరగతి) స్నేహితులతో కలిసి తన తల్లిదండ్రులు పని చేస్తున్న పొలం వద్దకు సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా కల్లు మండవ మూలమలుపు వద్ద పెద్దకోడెపాక నుంచి మైలారం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయిప్రియ ముక్కుకు గాయాలయ్యాయి. స్థానికులు సాయిప్రియ తల్లిదండ్రులకు సమాచారం అందించగా వారు ఆమెను పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సాయిప్రియ వైద్యం పొందుతోంది.

నేడు 'తాళ్ల పద్మావతి'కి సింగర్ సాయివేద రాక

కరీమాబాద్: వరంగల్ హంటర్ రోడ్డులోని తాళ్లపద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం జరుగనున్న వార్షికోత్సవ వేడుకలకు జీ సరిగమ లిటిల్ ఛాంప్స్ టైటిల్ విన్నర్స్ సింగర్ సాయివేద వాగ్దేవి హాజరవుతున్నారని ఆ విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగర్‌గానే కాకుండా డబ్బింగ్ ఆర్టిస్టుగా ప్రేక్షకులకు సుపరిచితురాలైన ప్రముఖ కళాకారిణి సాయివేదతోపాటు ముఖ్యఅతిథులుగా వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వాసంతి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ప్రముఖ సంగీత దర్శకులు తమన్ నిర్వహించే మ్యూజికల్ నైట్స్ ఈవెంట్స్‌లో బేబీ సాయివేద ప్రత్యేక పాటల కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసి సహకరించాలని కోరారు.



ఆత్మకూరు : ఆవిర్భావ వేడుకల్లో నాయకులు



ఎల్కతుర్తి : జెండా ఎగరేస్తున్న నాయకులు



ఐనవోలు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

బీఆర్ఎస్‌తోనే పేదల సంక్షేమం

● వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్
● ఊరూరా ఆవిర్భావ వేడుకలు

ఐనవోలు : బీఆర్ఎస్ హయాంలోనే పేదల సంక్షేమానికి బాటలు పడ్డాయని, పడుతాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. ఆ పార్టీ ఆవిర్భావం సందర్భంగా మండలంలోని పున్నేల్ క్రాస్ వద్ద డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు జెండా ఎగరేయగా ఎమ్మెల్యే రమేష్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీపీ తంపుల మోహన్, మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్, మిద్దెపాక రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, పల్లెల్లో గ్రామ కమిటీల అధ్యక్షుడు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ బొల్లె బోయిన రాధ రవియాదవ్, ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, నాయకులు ఎన్కతాళ్ల రవీందర్, పాపని రవీందర్, వంగాల భగవాన్‌రెడ్డి, అర్షం మధూకర్, బాషబోయిన సాగర్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండల కేంద్రాల్లో ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవీందర్, పార్టీ మండల అధ్యక్షులు గొడిశాల



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం వంగరలో..

సమ్మయ్య గౌడ్, మారుపాటి మహేందర్‌రెడ్డి పార్టీ జెండా ఎగరేసి స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు. పల్లెల్లోని బస్టాండ్‌ల వద్ద, ప్రధాన కూడళ్లలో నాయకులు జెండా ఎగరేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, నాయకులు గొల్లె మహేందర్, పిట్టల మహేందర్, కుర్ర సాంబమూర్తి, మునిగడప శేషగిరి, చిట్టి గౌడ్, వినయ్ గౌడ్, కార్తీక్, వెంకటేష్ యాదవ్, జగం రాజు, గడ్డం రవి, మాడుగుల కొమురయ్య, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలో బీఆర్ఎస్ జెండాను పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము ఆవిష్కరించి మాట్లాడారు. పల్లెల్లో గ్రామ కమిటీల అధ్యక్షుడు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, దామెరుప్పుల శంకర్, బత్తిని రాజు, వేల్పుల ప్రసాద్, జన్ను మల్లయ్య, హింగె



ధర్మసాగర్ : వేలేరులో..



కమలాపూర్ : జెండా ఆవిష్కరిస్తున్న సర్పంచ్

బాబురావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఆయా గ్రామాల పార్టీల అధ్యక్షులు జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : ధర్మసాగర్, వేలేరు మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మునిగెల రాజు, మరిజె నర్సింగరావు జెండా ఆవిష్కరించి సంబరాలు నిర్వహించారు. అలాగే పల్లెల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జెండాలను ఆవిష్కరించారు.

కమలాపూర్ : మండల కేంద్రంలో, గ్రామాల్లో జెండాలను ఆ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, నాయకులు ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు.

అంధత్వ రహిత సమాజమే ధ్యేయం



ఎల్కతుర్తి : కంటి పరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది



ఎల్కతుర్తి : శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

ఎల్కతుర్తి : అంధత్వ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం 'కంటి వెలుగు' కార్యక్రమం చేపట్టిందని ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనిత తెలిపారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో, భీమదేవరపల్లి మండలంలోని మల్లారంలో కంటి వెలుగు కార్యక్రమాలను వారు మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. 18 ఏళ్ల వయస్సులైన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులు పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ వంగ రవీందర్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, శేషగిరి, డాక్టర్ హిక్తేదార్ హైమ్మద్, సూపర్‌వైజర్ జునేది పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ మాదాసి అన్నపూర్ణ రాజు ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు శిబిరాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ స్పందన పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాల ఘనత ఎన్‌టీఆర్‌దే'

ధర్మసాగర్ (వేలేరు) : పేదలకు సంక్షేమ పథకాలు అమల్లోకి తీసుకొచ్చిన ఘనత టీడీపీ మాజీ అధినేత, దివంగత సీఎం ఎన్టీఆర్‌దేనని ఆ పార్టీ నేత గట్టు ప్రసాద్‌బాబు తెలిపారు. మండలంలోని పీచర గ్రామంలో పార్టీ మండల కన్వీనర్ బండ్లోజు కనకాచారి ఆధ్వర్యంలో 'ఇంటింటికీ టీడీపీ' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్టీఆర్ 1982లో టీడీపీని స్థాపించి 9 నెలల్లోనే అధికారంలోకి తీసుకొచ్చి ఉమ్మడి ఏపీలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. పాఠశాలలు, గురుకులాలు, జూనియర్, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేసి పేదలకు విద్యను చేరువ చేశారని



మాట్లాడుతున్న గట్టు ప్రసాద్‌బాబు

చెప్పారు. టీడీపీ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలను అభివృద్ధి చేయడంతోపాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు తీసుకొచ్చారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని ఎల్లయ్యగౌడ్, ధర్మారెడ్డి, శ్రీనివాసాచారి, సారయ్య, బండ్లోజు సునీత, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు పనిముట్లు పంపిణీ

ధర్మసాగర్ (వేలేరు) : భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళికలో భాగంగా మామునూర్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వేలేరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో 80 మంది మహిళా రైతులకు మంగళవారం కొంకలు, కొడవళ్లు పంపిణీ చేశారు. అనంతరం శాస్త్రవేత్త కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న మాట్లాడారు. పనిముట్లు కలుపు తీయడం, అంతర కృషి, ఇతర పనులకు ఉపయోగపడతాయని తెలిపారు. మహిళలు వ్యవసాయ రంగంలో రాణించేలా ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలను కేవీకే



కొంకలు పంపిణీ చేస్తున్న రాజన్న, తదితరులు

శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు వివరిస్తున్నట్టు తెలిపారు. మహిళా రైతులు వ్యవసాయ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు, ఏఈఓ శిల్ప, వార్డు సభ్యులు చిలుక భాస్కర్, సింగారపు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్: హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణ సంస్థలో 2023–24 విద్యా సంవత్సరానికి తల్లిదండ్రులు కోల్పోయిన (అనాథ) బాలికలు మూడేండ్ల డిప్లొమా కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి మాచర్ల శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్ ఇంజనీరింగ్‌లతోపాటు ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొత్తం 240 సీట్లను గాను 70 శాతం అనాథ బాలికలకు కేటాయించినట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తిగల బాలికలు హన్మకొండలోని బాలరక్షా భవన్‌లో దరఖాస్తు ఫారం పూర్తి చేసి కులం, ఆదాయం, బోనాఫైడ్, ఎస్ఎస్‌సీ మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌ఫొటోలు జతచేసి మే 10వ తేదీలోపు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 8464988186 లేదా 9676096183 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని దివ్యాంగులకు అందించే ఉపకరణములను పంపిణీ చేసేందుకు దరఖాస్తుల గడువును మే 5వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ఇంటర్మీడియట్, ఆపై ఉన్నత చదువులు చదువుతున్న అర్హులైన దివ్యాంగులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. టీఎస్ఓబీఎంఎంఎస్. సీజీజీ. జీఓవీ. ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు. దివ్యాంగులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గుర్తు తెలియని మహిళ సంచారం



ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని మహిళ మంగళవారం సంచరించింది. ఎస్సై గుగులోతు వెంకన్న కథనం ప్రకారం.. మంగళవారం సాయంత్రం కక్కిరాలపల్లి గ్రామ శివారులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహిళ అనుమానాస్పదంగా కనిపించింది. గ్రామస్తులు సమాచారం అందించగా సర్పంచ్ కంజర్ల రమేష్‌కు ఆమెను ఎక్కడి నుంచి వచ్చావని, ఇతర వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. సరైన సమాధానాలు చెప్పకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని ఆమెను ప్రాథమికంగా విచారించారు. రాత్రి కావడంతో పున్నేలు గ్రామంలోని కనకదుర్గ వృద్ధాశ్రమానికి పోలీసు వాహనంలో ఆమెను చేర్చారు. బుధవారం ఉదయం మహిళను విచారించి ఆమె కుటుంబ సభ్యుల వద్దకు చేర్చనున్నట్లు ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపారు.

పేద కుటుంబానికి 'మొలుగూరి' చేయూత



పరకాల : పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన బొచ్చు సుమన్‌కు బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మంగళవారం చేయూత అందించారు. సుమన్ చేపట్టిన ఇంటి నిర్మాణం ఆర్థిక ఇబ్బందులతో నిలిచిపోగా ఆయనకు భిక్షపతి ఆర్థికసాయం అందజేసి మాట్లాడారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామన్న హామీని సీఎం కేసీఆర్ విస్మరించి మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు వెంకటస్వామి, దంచనాల సత్యం, బీరం రాజు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం 62, 63వ డివిజన్ల కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ సయ్యద్‌రజాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రంను ఏర్పాటుచేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సందెల విజయ్, కొడిపాక గణేష్, సుంచు చంద్రయ్య, బోయిని కుమార్‌యాదవ్, మాచర్ల జయాకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ గురుకుల్‌లో స్నాతకోత్సవం



హన్మకొండ: బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రాథమిక విద్యార్థుల స్నాతకోత్సవం జరిగింది. ఏడాది పొడువునా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులకు హాజరైన విద్యార్థులు ప్రత్యేక డ్రెస్‌లు ధరించి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందుకోవడంతో ఉత్సాహంగా గంతులేశారు. పాఠశాల కరస్పాండెంట్ చిదురాల సోమరత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఇందిర, శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని సందేశం ఇచ్చారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యాధికారి, సిబ్బంది నిర్లక్ష్యం



ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ



వైద్యాధికారి కోసం ఎదురుచూస్తున్న రోగులు

● పీహెచ్‌సీలో రోగులకు ఇబ్బందులు

శాయంపేట : విధి నిర్వహణలో వైద్యాధికారి, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వారు సమయపాలన పాటించకపోవతుండడంతో పీహెచ్‌సీకి వైద్యం కోసం వస్తున్న రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యాధికారి, సిబ్బంది ఎప్పుడూ వస్తారో... ఎప్పుడు వెళ్తారో కూడా ఎవరికి తెలియని పరిస్థితి. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో మంగళవారం ఉదయం 10.15 గంటలు అయినా వైద్యాధికారి, సిబ్బంది విధులకు హాజరు కాలేదు. ఓపీ ఖాళీగా దర్శనమిచ్చింది. అయినా వైద్య శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించని వైద్యాధికారి, సిబ్బందిపై చర్యలు తీసుకుని రోగులకు వైద్యం అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పేదలను ఆదుకునేలా పథకాలు

● ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల : పేదలను ఆదుకునేల రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. పరకాల నియోజకవర్గ పరిధిలోని పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన 207 మంది లబ్ధిదారులకు పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. పేద పేద కుటుంబాల్లో వెలుగులు నింపేలా పథకాలు రూపొందించి అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత



లబ్ధిదారులతో ఎమ్మెల్యే ధర్మారెడ్డి

రామకృష్ణ, పరకాల, నడికూడ ఎంపీపీలు టి.స్వర్ణలత, అనసూర్య, జెడ్పీటీసీ కొడెపాక సుమలత, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం



అభిషేకం చేస్తున్న భక్తులు



కల్యాణ వేడుకను నిర్వహిస్తున్న వేద పండితులు

● కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర, శివ మార్కండేయ ఆలయ సముదాయాల్లో నిర్వహిస్తున్న దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం మూడో రోజు అత్యంత వైభవంగా కొనసాగాయి. మూల విరాట్టులకు పంచామృత, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు శేషు శిష్యులు గుమ్మడవెల్లి గణేష్ అత్రేయ శర్మ, వడ్లకొండ శివకుమార్ శర్మ, డెబ్బట రామానుజచార్య శర్మ, దుర్గాసాయి శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి, పర్వతవర్ధిని సమేత శివపార్వతుల కల్యాణ మహోత్సావాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవాలను తిలకించడానికి మండలవ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం శాయంపేట గ్రామానికి చెందిన మామిడి లక్ష్మీనారాయణ–సమ్మక్క దంపతుల స్మారకంగా వారి కుమారుడు, హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది (హోంశాఖ) మామిడి రూపేందర్ ఆధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు, రిటైర్డ్ ప్రొఫెసర్, మాజీ స్పీకర్ ఓఎస్‌డీ గడ్డం భాస్కర్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై డీజే సౌండ్స్ నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఉత్సవాల్లో మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, సర్పంచ్ కందగట్ల రవి, ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్, ప్రముఖులు బాసాని చంద్రమౌళి, బాల్నె తిలక్ బాబు, మంత్రి రాజు, మామిడి శ్రీనివాసులు, రాజు, దుబాసి రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యత చాటాలి

● పోపా అధ్యక్షుడు డాక్టర్ రాజేశ్వరప్రసాద్

పరకాల : సమస్యల పరిష్కారం కోసం పద్మశాలి కులస్తులు రాజకీయాలకు అతీతంగా ఐక్యత చాటాలని పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) పరకాల అధ్యక్షుడు డాక్టర్ పోతాని రాజేశ్వరప్రసాద్ కోరారు. పట్టణంలోని పద్మశాలి భవన ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సంఘం పరకాల మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. చేనేత కార్మికులు, పద్మశాలి కులస్తుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. పద్మశాలి కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

రూరల్ అధ్యక్షుడిగా దాసరి భిక్షపతి

పద్మశాలి సంఘం పరకాల రూరల్ కమిటీని ఏక్రగీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా దాసరి భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా దాసి రాజు, కోశాధి



భిక్షపతిని సన్మానిస్తున్న రాజేశ్వరప్రసాద్, తదితరులు

కారిగా బొద్దుల రాజయ్య, గౌరవ అధ్యక్షుడుగా అయిత సాంబయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిదురాల దేవేందర్, జిల్లా నాయకుడు మెండు రవీందర్, రాయపర్తి గ్రామ కమిటీ అధ్యక్షుడు గాదె శంకరయ్య, పట్టణ మాజీ అధ్యక్షుడు మార్త భిక్షపతి, పట్టణ ప్రధాన కార్యదర్శి కందకట్ల రాజు, పోపా ప్రధాన కార్యదర్శి దుంపేటి నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దానం నిరంజన్, పైడిపల్లి సర్పంచ్ అడికెల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు

హన్మకొండ చౌరస్తా: జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యులు లేకపోతే నేడు సనాతన హిందూ ధర్మం ఉండేది కాదని, ఆయన ఈ పవిత్ర భారతావని లో జన్మించిన కారణజన్ములని విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం సంచాలకులు చొల్లేటి కృష్ణమాచార్యులు అన్నారు. ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు మంగళవారం హనుమకొండ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతు సనాతన హిందూ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు, ప్రజల్లో ఆయన తీసుకొచ్చిన చైతన్యవంతమైన సేవలను కొనియాడారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతి నాయకులు డాక్టర్ విష్ణువర్ధన్, వీరన్న, సదానందం,కృష్ణమూర్తి, చక్రపాణి, రామన్న, వీరన్న, నాగ, మహేశ్వరం బిక్షపతి, పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
వి.రాజ్‌కుమార్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274